క్లుప్తంగా

బుద్ధ, కల్కి అవతారాల్లో జగన్నాథస్వామి



గుండిచా మందిరంలో పూజలు అందుకుంటున్న స్వామివారు

బలిజిపేట: జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు శుక్రవారం స్వామివారిని బుద్ధ, కల్కి అవతారాల్లో అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు ఆర్.పార్థసారధి ఆచార్యులు, సురేషలు గుండిచా మందిరం వద్ద స్వామివారికి అవతారాలను మార్పుచేసి పూజాకార్యక్రమాలు చేసి, ధూపదీప నైవేద్యాలు స్వామివారికి సమర్పించిన అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణ అవతారంలో జగన్నాథుడు



శ్రీకృష్ణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథ స్వామి

పార్వతీపురం టౌన్: జగన్నాథుని రథోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు శ్రీకృష్ణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని గుండిచా మంటపం వద్ద స్వామివారి రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి ఆలయ అర్చకులు రవీంద్రపండా, శశిభూషణ్ పండాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సూర్యవతి సేవలు మరువలేనివి



సూర్యవతికి నివాళులు అర్పిస్తున్న ఐద్వా నాయకురాళ్లు తదితరులు

సాలూరు: మహిళల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసిన, అఖిలభారత ప్రజాతంత్ర మహిళాసంఘం ఐద్వాకు తొలి రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన మణికొండ సూర్యవతి సేవలు మరువలేనివని ఐద్వా నాయకురాళ్లు ఇందు, స్వప్న తదితరులు కొనియాడారు. సూర్యవతి 32వ వర్ధంతిని సాలూరు పట్టణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యవతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



ఎంఈఓకు సమ్మెనోటీసు అందజేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం నాయకులు

పార్వతీపురం టౌన్: ఈ నెల 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మధ్యాహ్న భోజన నిర్వాహకులు, స్కూల్ స్వీపర్లు మద్దతు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం మండల విద్యాశాఖ అధికారి వై. విజయకు మారికి మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం అధ్యక్షురా జి.తులసి, సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణలు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.సూరిబాబు, బి. లక్ష్మి, జి.కృష్ణ మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం, స్కూల్స్ స్వీపర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కట్టెల పొయ్యిపై 'మధ్యాహ్న' వంట



కట్టెల పొయ్యిపై వండుతున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

పార్వతీపురం రూరల్: మండలంలోని కొత్తపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట నిమిత్తం పాఠశాలలో ఉన్న 410 మంది విద్యార్థులకు వంట చేసేందుకు ప్రభుత్వం సరిపడా గ్యాస్ సిలిండర్లు కేటాయించక పోవడంతో కర్రలపైనే వంట చేయాల్సి వస్తోంది. కేవలం ఒక సిలిండర్‌కు మాత్రమే ప్రభుత్వం నెలకు కేటాయించినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. వర్షం పడితే భోజనం వండేందుకు కుస్తీలు పట్టాల్సిన దుస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే కట్టెల పొయ్యిపై వంటతో పొయ్యి ద్వారా వ్యాపిస్తున్న పొగ పాఠశాల తరగతి గదుల్లోకి చేరి విద్యార్థులకు ఇబ్బందికరంగా మారుతోంది. ఇంతమందికి మధ్యాహ్న భోజనం సిద్ధం చేసే క్రమంలో పాఠశాలలు గ్యాస్‌తోపాటు మరిన్ని వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

చొక్కాపువానివలస గ్రామంలో కాలువ నిండి రోడ్డుపైకి మురుగునీరు చేరడంతో బురదగా మారిన రహదారి



- మురుగుతో పేరుకుపోయిన కాలువలు
- అధ్వానంగా తయారైన రహదారులు
- బురదతో నిండిపోయిన వీధిరోడ్లు
- నిల్వ నీటితో విజృంభిస్తున్న దోమలు

పార్వతీపురం రూరల్: నియోజకవర్గంలోని పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రస్తుతం వర్షాలు అడపాదడపాగా కురుస్తున్న పరిస్థితుల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడిచెత్త అక్కడే పేరుకుపోయి దోమలు, ఈగలు, కుక్కలు, పందులకు ఆవాసాలుగా దర్శనమిస్తున్నాయి. వర్షం కురవడంతో చెత్త నిల్వలు తడిచి చుట్టుపక్కల ఉన్న జనవాసాల్లో దుర్గంధం వెదజల్లుతోంది.

బురద దారులే గతి

పారిశుద్ధ్య లోపం కారణంగా కాలువల్లో మురుగు నీరు నిండి రోడ్డుపైకి రావడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దారులు బురద బురదగా తయారవడంతో స్థానికులు, వాహన చోదకులను తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. గ్రామాల మధ్యభాగంలో ఉన్న రహదారులపై ప్రయాణం చేస్తూ పట్టణ ప్రాంతానికి వచ్చేందుకు వినియోగించే దారులు ఈ దుస్థితితో దర్శనమిస్తున్నాయి. రహదారంతా బురదతో అధ్వానంగా మారి అక్కడక్కడా కాలువలు సక్రమంగా లేక మురుగుతో నిండిన కాలువల్లో నీరు



ఎమ్మార్‌నగరంలో రోడ్డుపక్కనే వేసిన చెత్త

రహదారిపైకి చేరుతోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే వాడకనీరు రహదారిపైకి రావడంతో మలుపుల వద్ద మరింత పదునుగా బురదతో ప్రమాదకరంగా దారులు తయారవుతున్నాయి. పారిశుద్ధ్య పనులు తూతూమంత్రంగా కాకుండా సక్రమంగా ఆయా గ్రామాల ప్రజలు మస్తులునిర్వహించాలని కోరుతున్నారు.

ఎక్కడ పడితే అక్కడే చెత్త పారబోత

గ్రామాల్లో చెత్తసేకరణ కేంద్రాలు ఉన్నప్పటికీ చెత్తను మాత్రం గ్రామాల్లో ఉన్న వీధుల కూడళ్లలో వేస్తూ బాధ్యతారాహిత్యంగా సిబ్బందితో పాటు గ్రామస్తులు వ్యవహరిస్తున్నారు. రోజూ క్రమం తప్పకుండా పారిశుద్ధ్య సిబ్బంది సకాలంలో తడి, పొడి చెత్త సేకరించి కేంద్రాలకు తరలించాల్సింది పోయి ఈ విధంగా ఎక్కడపడితే అక్కడ చెత్త డంప్ చేయడంతో గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పత్రికల్లో కథనాలు, అధికారులు వచ్చేటప్పుడు మాత్రమే తూతూ మంత్రంగా పనులు చేపట్టి అనంతరం పారిశుద్ధ్య నిర్వహణ పక్కన పెడుతున్నారని స్థానికులు సైతం తమ అవస్థలు తెలియజేస్తూ అధికారుల నిర్వాకంపై మండిపడుతున్నారు.



ఎస్.ములగలో బురదమయమైన రహదారి



కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపుతున్న నాయకులు తదితరులు

సాలూరు: ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ సాలూరు డిపో కార్యదర్శి కిరణ్‌కుమార్ కోరారు. సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 01/2019 సర్క్యులర్‌ను యథావిధిగా అమలుచేయాలి. పెండింగ్‌లో ఉన్న డీఏలు, ప్రమోషన్‌లు వెంటనే ఇవ్వాలి. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సొంతంగా కొనుగోలు చేయాలి. ఈ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్‌ను ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, టీఆర్ బాబు, కాంతారావు, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ నిర్వహించాలి

పార్వతీపురం టౌన్: మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ తప్పని సరిగా నిర్వహించాలని డీఐఈఓ వై.నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్లకు చెందిన జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో ఆయన అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌ను ఈనెల 10వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, వివిధ సంక్షేమ, ప్రైవేట్ కార్పొరేట్ అన్ని జూనియర్ కళాశాలల్లోను ఈ మీటింగ్ నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని 83 జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిద్దాం

- డీఎల్‌పీఓ నాగభూషణరావు



గ్రామసభలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో నాగభూషణరావు

మక్కువ:

ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మక్కువ పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించుకుందామని డివిజనల్ పంచాయతీ అధికారి మునగాల నాగభూషణరావు అన్నారు. ఈ మేరకు స్థానిక సచివాలయంలో శుక్రవారం గ్రామసభను సర్పంచ్ ఒంటి రామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. గ్రామసభ సమావేశానికి డీఎల్‌పీఓ నాగభూషణరావు హాజరై మాట్లాడారు. మక్కువ పంచాయతీని అంతా కలిసి, అభివృద్ధిచేద్దామని పిలుపునిచ్చారు. ఏ సమస్య ఉన్నా, ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువస్తే, సమస్యను పరిష్కరించేదిశగా చర్యలు చేపడతారన్నారు. సర్పంచ్ రామలక్ష్మి మాట్లాడుతూ మండల కేంద్రం మక్కువలో ఇటీవల ఎల్ఈడీ సెన్సార్ బల్బులు ఏర్పాటుచేశామని చెప్పారు. అనంతరం మక్కువలో ఇన్‌చార్జ్ ఈవోగా విధులు చేపట్టిన సురేష్‌కు కురుపాం మండలం బదిలీ కావడంతో, ఈవో శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది సత్కరించారు.

పొగాకు వినియోగం ప్రాణాంతకం

- ఎన్‌సీడీ పీఓ డాక్టర్ జగన్‌మోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌సీడీ పీఓ డాక్టర్ జగన్‌మోహనరావు

పార్వతీపురం టౌన్: పొగాకు ఉత్పత్తుల వినియోగంతో కలిగే దుష్ప్రభాలపై అవగాహన పెంచి భవిష్యత్ తరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు తెలిపారు. పొగాకు వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా పట్టణంలోని చర్చివీధిలో గల డీఎం ఉన్నత పాఠశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు వల్ల అనారోగ్య సమస్యలను సూచించే పోస్టర్లను ప్రదర్శించి విద్యార్థులతో చదివించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సామాజిక ప్రగతికి ఆరోగ్యకరమైన జీవనశైలి ఉండాలని, విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని సూచించారు. పొగాకు ఉత్పత్తులైన సిగరెట్, బీడీ, చుట్ట, ఖైనీ, గుట్కా వినియోగం ఆరోగ్యంపై తీవ్రమైన దుష్ప్రభావాలను కలిగిస్తుందని ముఖ్యంగా ప్రాణాంతక వ్యాధులైన కేన్సర్ మహమ్మారికి కారణ భూతమవుతుందని తెలియజేశారు. శరీరంలో ముఖ్యమైన అవయవాలను నాశనం చేస్తుందన్నారు. నోటి కేన్సర్, ఊపిరితిత్తులు, బ్లడ్ కేన్సర్, మూత్రపిండాలు, దీర్ఘకాలిక వ్యాధులైన పక్షవాతం, అంధత్వం, చిగుళ్లవాపు, గుండెవ్యాధులు, ఆయాసం, సంతానోత్పత్తి తగ్గిపోవడం, నరాల బలహీనత ఇంకా అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు.

వైద్యసిబ్బంది పలు శాఖల సమన్వయంతో జూలై 21 వరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీధర్, ఎన్టీపీసీ కౌన్సిలర్ కె.భవాని, డిప్యూటీ డెమోలు సన్యాసిరావు, యోగేశ్వరరెడ్డి, ఎపిడమిక్ ఈఓ సత్తిబాబు, పీఈటీ అశోక్ నాయుడు, వైద్యసిబ్బంది ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దడానికి సహకరించాలి



లచ్చయ్యపేటలో మాట్లాడుతున్న గ్రామపంచాయతీ జిల్లా అధికారి కొండలరావు

సీతానగరం: గ్రామాల్లో వర్షాలు కురుస్తున్న కారణంగా సీజనల్ వ్యాధుల నివారణకు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల పర్యవేక్షణలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ జిల్లా అధికారి కొండలరావు కోరారు, ఈ మేరకు సీతానగరం మండలంలోని లచ్చయ్యపేటలో జరుగుతున్న పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా పనులను ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ, పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నిరసన



విశ్వభారతి స్కూల్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మక్కువ: స్థానిక విశ్వభారతి ప్రైవేట్ పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విశ్వభారతి ప్రైవేట్ పాఠశాల ఐసీఈఎస్, సీబీఎస్ఈ, స్టేట్‌బోర్డు పాఠ్యప్రణాళికను బ్యానర్‌లో ముద్రించి ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. దీనిపై జిల్లా విద్యాశాఖ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే పుస్తకాలు అధిక ధరలకు అమ్ముతున్నారని వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయకార్యదర్శి హరికృష్ణ, మండల నాయకులు దుర్గాప్రసాద్, వికాస్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

సాలూరు:

మొక్కలు నాటి, పర్యావరణాన్ని ప్రజలు పరిరక్షించాలని స్ఫూర్తి మహిళా మండలి డైరెక్టర్ బలగ రాధ కోరారు. ఈ మేరకు 23వ వార్డులో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటాలని, తద్వారా ఆక్సిజన్‌ను పెంపొందించవచ్చన్నారు.అనంతరం ఇంటింటా మహిళలతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో మహిళామండలి నాయకురాళ్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విస్తృత స్థాయి సమావేశం విజయవంతం చేద్దాం



మాజీ ఎమ్మెల్యే జోగారావును మర్యాదపూర్వకంగా కలిసిన వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ అనుబంధ విభాగం ప్రధాన కార్యదర్శి దేవుపల్లి నాగరాజు

- పిలుపునిచ్చిన మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో మూడు మండలాలు, పురపాలక సంఘం సంఘం పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మూడు మండలాల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, బొంగు చిట్టిరాజు, పాలవలస మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథం, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి బంకపల్లి వాసుదేవరావు, రాష్ట్ర ఆర్‌టీఐ విభాగం కార్యదర్శి దేవుపల్లి నాగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ అనుబంధ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియామకమైన పార్వతీపురం పురపాలక సంఘానికి చెందిన దేవుపల్లి నాగరాజు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే జోగారావును ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి అందరితో కలిసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండలాల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే అంతే..



జిల్లా కేంద్రం వైపు గ్రానైట్ భాగాన్ని తీసుకు వెళ్తున్న భారీ వాహనం

పార్వతీపురం రూరల్: మండలంలోని వెలగవలస పంచాయతీ పరిధి బడిదేవరకొండ వద్ద ఉన్న గ్రానైట్ క్వారీ నుంచి వేరు చేసిన భారీ గ్రానైట్ భాగాలు భారీ వాహనాలపై నిత్యం రవాణా చేస్తున్నారు. ఇప్పటికే ఇరుకైన రహదారులపై గుంతలతో అవస్థలు పడుతూ ప్రయాణం చేస్తున్న వాహన చోదకులు ఈ భారీ వాహనాల రాకపోకలతో భయాందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే నేరుగా ఆ వాహనాలు నిత్యం రద్దీగా ఉండే జిల్లా కేంద్రం మీదుగా వెళ్తుండడంతో జరగరానిది ఏదైనా జరిగితే పెద్దఎత్తున ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని పట్టణ వాసులు వాపోతున్నారు. వాహనం అదుపుతప్పినా, ప్రమాదానికి గురైనా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని భయాందోళన చెందుతున్నారు.

శాకంబరి అవతారంలో దుర్గమ్మ



శాకంబరి అవతారంలో దుర్గాభవాని

పార్వతీపురంటౌన్:
పట్టణంలోని బైపాస్ కూడలి వద్ద గల దుర్గాభవాని ఆలయంలో శుక్రవారం అమ్మవారు శాకంబరీ అవతారంలో దర్శనమిచ్చారు. ఆషాడ మాసంలో శాకంబరీ దేవిగా అమ్మవారిని దర్శించుకోవడం అదృష్టమని భక్తులు భావిస్తారు. దీంతో ఆలయ కమిటీ వారు దాతల సహకారంతో వివిధ రకరకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నిర్దేశించిన ధరకు లైసెన్స్‌డ్ ఫెర్టిలైజర్స్ నిర్వాహకులు ఎరువులు విక్రయించాలని ఏఓ ఎస్ అవినాష్ అన్నారు. ఈ మేరకు సీతానగరంలో ఒకటి, బూర్జ గ్రామంలో ఉన్న రెండు ఎరువులు దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందుగా దుకాణాల్లో ఉన్న ఎరువుల నిల్వలు, విక్రయాలు చేరవలసిన ఎరువు వివరాలు, రైతులకు ఎరువులు ఎంత అవసరమో అనే అంశాలపై రికార్డులను సమీక్షించారు. అలాగే మండలంలోని 20 రైతు సేవా కేంద్రాల ద్వారా 204 మెట్రిక్‌టన్నుల యూరియా, 149 మెట్రిక్‌టన్నుల డీఏపీ సరఫరా చేశామన్నారు. నిర్వాహకులు అన్ని దుకాణాల్లో ఎరువుల ధరల పట్టిని విధిగా ఏర్పాటు చేయాలని, స్టాక్ రిజిస్టర్ ఎప్పటికప్పుడు విధిగా అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అల్లూరి పట్టుదల ఆదర్శనీయం

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



పార్వతీపురం రూరల్: అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: విప్లవజ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహోజ్వల శక్తి అని పేర్కొన్నారు. బ్రిటిష్ వారి గుండెల్లో సింహస్వప్నంగా నిలిచిన విప్లవజ్యోతి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వతంత్ర చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయమని కొనియాడారు. ఆయన దేశభక్తి స్ఫూర్తి, భారతీయ జాతీయవాదం జ్వాలలను రేకెత్తించిందని, దేశంలో బ్రిటిష్ పాలకుల దోపిడీ, దురాగతాలు, దమనకాండకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేపట్టేందుకు అనేకమందిని ప్రేరేపించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఏఆర్ ఆర్ఐ నాయుడు, రాంబాబు, ఏఏఓ సతీష్ బాబు, సూపరింటెండెంట్ శ్రీనివాస రావు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, ఎస్టీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సేవలు చిరస్మరణీయం

సాలూరు: భారత స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు సేవలు చిరస్మరణీయమని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని తన గృహం వద్ద, వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు అల్లూరి

బలిజిపేట: బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు కొనియాడారు. ఈ మేరకు పెదపెంకిలోని నేతాజీ గ్రంథాలయం వద్ద అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో కె.తాతబాబు, కేశవ, జి.శ్రావణ్, కె.గౌరీనాథ్, పి.పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో అధ్యయనం చేయాలి

పార్వతీపురం టౌన్: అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో సమాజాన్ని యువత అధ్యయనం చేయాలని ప్రముఖకవి, రచయిత గంట్యాడ గౌరునాయుడు మాస్టారు అన్నారు. ఈ మేరకు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సభను గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అధ్యక్షతన బైపాస్ రోడ్డులోని గిరిజన బాలుర కళాశాల వసతిగృహంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఒ.మల్లేసు వందలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు.



సాలూరు: అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తదితరులు



బలిజిపేట: అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన సుబ్బారావు, గ్రామస్తులు